ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

బుధవారం 2 ఏప్రిల్ 2025



ముగిసిన పదో తరగతి పరీక్షలు

బెలగాం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు మంగళవారం 67 కేంద్రాల్లో 10,347 మంది విద్యార్థులకు గాను 10,296 మంది హాజరయ్యారు. 21 స్క్వాడ్ బృందాలు, ఆర్‌జేడీలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, పోలీసుల సహకారంతో విజయవంతంగా పరీక్షలను నిర్వహించామని విద్యాశాఖ ఏడీ రమాజ్యోతి తెలిపారు. పరీక్షలు పూర్తవడంతో కేంద్రాల నుంచి విద్యార్థులు ఉల్లాసంగా బయట కొచ్చారు. తోటి విద్యార్థులతో తీపి జ్ఞాపకాలు పంచుకుంటూ.. వీడ్కోలు చెప్పుకున్నారు. హాస్టల్ విద్యార్థులు ఇంటిబాట పట్టారు.

ముగిసిన పోలమాంబ జాతర

- ఘనంగా మహాచండీ హోమం
- ఆఖరి వారం.. తరలివచ్చిన భక్తజనం



మక్కువ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత పోలమాంబ సంబరాలు ముగిశాయి. మంగళవారం పదోవారం జాతరను ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గోముఖి నది తీరాన కోళ్లు, చీరలు, పసుపు కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. వనం గుడి వద్ద ఉన్న వేపచెట్టుకు మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆఖరి వారం కావడంతో వేద పండితులు మంత్రోచ్చరణల నడుమ వనంగుడి వద్ద మహా చండీ హోమం నిర్వహించారు. ఈ పూజల్లో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఆ తర్వాత అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

అనంతరం సుమారు 5 వేల మందికి భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. చండీహోమంలో పాల్గొన్న వారికి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ ఏర్పాట్లు చేశారు. సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పోలినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



చండీ హోమంలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

చెల్లింపులెప్పుడో?

- ఆర్థిక సంవత్సరం ముగిసినా అందని వేతనాలు
- అభివృద్ధి పనులకూ మంజూరు కాని బిల్లులు
- పేరుకుపోతున్న బకాయిలు
- నిరాశలో ఉపాధి వేతనదారులు.. కాంట్రాక్టర్లు



పార్వతీపురం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి వేతనదారులకు నిరాశే మిగిలింది. ఆర్థిక సంవత్సరం ముగింపు రోజున వారి ఖాతాల్లో వేతనాలు జమ కాలేదు. దీంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కొద్ది నెలలుగా వేతనాలు చెల్లింపులు నిలిచి పోవడంతో వేతనదారులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. నిబంధనల ప్రకారం పనులు చేపట్టిన వారం రోజుల్లో కూలి చెల్లించాల్సి ఉంది. అయితే మూడు నెలలు గడుస్తున్నా.. ఇంతవరకూ కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంపై వారు పెదవి విరుస్తున్నారు. ప్రైవేట్ పనులకు వెళ్లినా రోజువారీ వేతనం వచ్చేదని చెబుతున్నారు. ప్రస్తుతం కుటుంబ పోషణ కష్టంగా మారిందని వాపోతున్నారు. ప్రస్తుతం ఎండలను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తున్నా వేతనాలు రాకపోవడంపై ఉపాధి కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లాలో సుమారు రూ.16 కోట్ల వరకు వేతన బకా యిలు ఉన్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బకాయిలు (కోట్లలో)	
భామిని	2.2
బలిజిపేట	2.26
గరుగుబిల్లి	2.13
గుమ్మలక్ష్మీపురం	4.34
జియ్యమ్మవలస	5.66
కురుపాం	2.24
కొమరాడ	5.68
మక్కువ	8.06
పాచిపెంట	6.23
పార్వతీపురం	4.61
పాలకొండ	2.54
సాలూరు	4.80
సీతంపేట	5.60
సీతానగరం	4.12
వీరఘట్టం	5.73

అభివృద్ధి పనులకూ నిలిచిన చెల్లింపులు

జిల్లాలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకూ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. సుమారు 66.60 కోట్ల మేర బకాయిలున్నట్లు తెలిసింది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధుల ద్వారా సీసీ, బీటీ రోడ్లు, ప్రహరీ, గోశాలలు తదితర నిర్మాణాలు చేపట్టారు. మండల స్థాయి అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకొని వచ్చి ఆగమేఘాల మీద వాటి నిర్మాణాలు పూర్తి చేయించారు. కానీ వాటికి సంబంధించి బిల్లులు మాత్రం మంజూరు కాలేదు. మార్చి 31లోపు చెల్లింపులు జరగకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర నిరాశ చెందారు. అప్పులు చేసి పనులు చేపట్టామని , ప్రస్తుతం వడ్డీలు కట్టలేకపోతున్నామని వారు వాపోతున్నారు. మొత్తంగా ఉపాధి బిల్లుల చెల్లింపుల కోసం అటు వేతనదారులు, ఇటు కాంట్రాక్టర్లు ఆశగా ఎదురు చూస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. 'నిధులు మంజూరైన వెంటనే బిల్లులు చెల్లిస్తాం. వేతనదారులకు మరో రెండు రోజుల్లో చెల్లింపులు జరిగే అవకాశం ఉంది.' అని డ్వామా పీడీ రామచంద్రరావు తెలిపారు.



పెదబొండపల్లిలో ఫాంపాండ్ పనులు చేపడుతున్న వేతనదారులు

వంద రోజులు పూర్తయిన కుటుంబాలు 46,227

గరుగుబిల్లి: జిల్లాలో 100 రోజుల పనులు పూర్తయిన కుటుంబాలు 46,227గా అధికారులు గుర్తించారు. ఈ మేరకు నివేదికలు అందించారు. 'మన్యం'లో 52,23,050 కుటుంబాలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నాయి. కాగా వీరిలో 100 రోజులు పూర్తయిన వారు 46,227 మంది ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆర్‌వోఎఫ్ఆర్ పోడు సాగుకు సంబంధించి 150 పని దినాలు కల్పించారు. మొత్తంగా జిల్లాలో 1.69 లక్షల మేర జాబ్‌కార్డులు ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1.23 కోట్ల పని దినాల లక్ష్యం నెరవేర్చామని డ్వామా పీడీ కె.రామచంద్రరావు తెలిపారు. కాగా 6,200 శ్రమ శక్తి సంఘాలు పనుల్లో పాల్గొంటున్నాయని వెల్లడించారు.

ఫాంపాండ్స్‌తో భూమి సారవంతం

- జిల్లా ప్రత్యేకాధికారి నారాయణ భరత్ గుప్తా

కొమరాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఏర్పాటు చేస్తున్న ఫాంపాండ్స్ సాగు భూములను సారవంతంగా చేస్తాయని జిల్లా ప్రత్యేకాధికారి నారాయణభరత్ గుప్తా తెలిపారు. మంగళవారం విక్రాంపురంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పశువుల నీటి తొట్టెల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం తమ్మన్నదొరవలసలో మినీ గోకులాలను పరిశీలించి లబ్ధిదారులతో ముచ్చటించారు. నందాపురంలో ఫాంపాండ్స్‌ను తనిఖీ చేసిన ఆయన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఫాంపాండ్స్‌తో సాగులో నీటి కొరతను తీర్చి పంటల దిగుబడిని పెంచడం, తద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. వాటితో వర్షపు నీటిని సేకరించి సాగుతో పాటు పశువులకు అందించొచ్చని, చేపల పెంపకం వంటివి కూడా చేపట్టొచ్చని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో 411 నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట డ్వామా పీడీ కె.రామచంద్రరావు తదితరులు ఉన్నారు.



తమ్మన్నదొరవలసలో గోకులం షెడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

మళ్లీ మోగనున్న బాజాలు

- 6 నుంచి వివాహ ముహూర్తాలు

6లో



భామిని నుంచి ఒడిశాకు..

- వంశధార నది దాటి వెళ్లిన ఏనుగులు

భామిని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భామిని మండలంలో సంచరిస్తున్న నాలుగు ఏనుగులు ఒడిశా వైపు వెళ్లాయి. ఏవోబీ సరిహద్దు బిల్లుమడ నుంచి వంశధార నది దాటి సోమవారం రాత్రి రెండు ఏనుగులు ఆ రాష్ట్రానికి వెళ్లాయి. ప్రస్తుతం ఒడిశా గ్రామాలైన గౌరి, పురిటిగూడ మధ్యలో అవి సంచరిస్తున్నాయి. కాగా బిల్లుమడ సమీపంలోనే హల్‌చల్ చేసిన మరో రెండు గజరాజులు సైతం మంగళవారం నది దాటి ఒడిశాకు చేరాయి. అయితే అవి ఏ క్షణాన అయినా తిరుగుముఖం పట్టే అవకాశం ఉందని నేరడి, బిల్లుమడ, సింగిడి, పసుకుడి నదీ తీర గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అటవీ శాఖాధికారులు కూడా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నది తీరానికి ఎవరూ వెళ్లరాదని సూచిస్తున్నారు.

16.12 శాతం వృద్ధికి ప్రణాళికలు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 16.12 శాతం వృద్ధి సాధనకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లా తలసరి ఆదాయం రూ.1,67,543 కాగా, ఈ ఏడాది రూ.1,94,048 అంచనా వేసినట్లు చెప్పారు. 49.27 శాతం పారిశ్రామిక, 41.64 శాతం సేవా రంగాల పురోగతే లక్ష్యంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వ్యవసాయ, మత్స్య, ఉద్యాన పంటలపై దృష్టి సారిస్తామన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తామని, డ్వాక్రా, శ్రీనిధి, ఐటీడీఏల నిధులు నుంచి గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. గత మూడేళ్లలో 'ఉపాధి' కింద 128.91 లక్షల పనిదినాలు కల్పించినట్లు వెల్లడించారు. ● జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 7,134 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందేనని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. పీఎం జన్‌మన్ కింద మూడు నెలల్లో నాలుగు వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ ద్వారా ప్రజలకు సేవలు అందించాలని ఆదేశించారు. చెత్త సంపద తయారీ కేంద్రాలను పనిచేయించాలన్నారు. జాయింట్ కలెక్టర్ శోభిక మాట్లాడుతూ.. రైతు గుర్తింపు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆహారంతోనే ఆరోగ్యం

- ప్రజల్లో ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ
- చిరుధాన్యాల వినియోగంపై ఆసక్తి

6లో

93 శాతం పింఛన్ల పంపిణీ

గరుగుబిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో మంగళవారం 93 శాతం మేర ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. తొలిరోజు 1,39,752 మంది లబ్ధిదారులకు గాను 1,29,162 మందికి సచివాలయాల సిబ్బంది పింఛన్ సొమ్ము అందించారు. వివిధ రకాల పింఛన్ల కోసం ప్రభుత్వం రూ. 59.72 కోట్లు మంజూరు చేయగా.. ఎల్1 స్కానర్లతో పంపిణీ వేగవంతంగా పూర్తి చేశారు. తొలిరోజు అందుబాటులో లేని వారికి బుధవారం పింఛన్లు అందించనున్నారు. ఇదిలాఉండగా సమస్యలైనా ఉన్నాయా? అంటూ ముఖ్యమంత్రి కార్యాలయం పింఛన్‌దారుల నుంచి సమాచారం సేకరించింది.



గిరిజన కళలను ప్రోత్సహిస్తాం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గిరిజన సవర హస్తకళలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పీఎంఆర్‌సీలో నిర్వహిస్తున్న సవర పెయింటింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెయింటింగ్ చిత్రాలను పరిశీలించి గిరిజన కళాకారులను అభినందించారు. ఈ శిక్షణలను మరికొన్ని రోజులు పొడిగించాలని సూచించారు. పెయింటింగ్ ఎగ్జిబిషన్ కోసం పీఎంఆర్‌సీలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండు గదులను కేటాయిస్తామని స్పష్టం చేశారు.



కళాకారులు వేసిన సవర చిత్రాలను తిలకిస్తున్న ఇన్‌చార్జి పీవో

ధర బాగున్నా.. దిగుబడి లేదు

- ఇదీ జీడి పంట పరిస్థితి
- పొగమంచు, అకాల వర్షాల ప్రభావం
- ఆందోళనలో ఆదివాసీలు

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మన్యంలో జీడి పిక్కల ధర ఆశాజనకంగా ఉంది. అయితే ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు మాత్రం లేవు. దీంతో ఆదివాసీలు తలలు పట్టుకుంటున్నారు. అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో సుమారు లక్ష ఎకరాల్లో జీడి పంట సాగవుతుంది. కొమరాడ, జియ్యమ్మవలస, గుమ్మ లక్ష్మీపురం, సాలూరు, పాచిపెంట, సీతంపేట, నీలకంఠాపురం, మొండెంకల్, భామిని, వీరఘట్టం మండలాల్లో ఎంతోమంది గిరిజనులు దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వ్యాపారుల వద్ద అప్పులు చేసి సాగు చేపట్టి.. పంట చేతికొందొచ్చిన తర్వాత గిరిజన రైతులు తిరిగి చెల్లిస్తుంటారు. అయితే గత రెండేళ్లుగా పరిస్థితి అనుకూలంగా లేదు. తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా వారు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. వ్యాపారులకు తిరిగి చెల్లించక లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ ఏడాది కిలో జీడి పిక్కల ధర రూ.150 వరకూ పలుకుతుండడంతో వారెంతో సంబర పడ్డారు. అయితేపొగ మంచు, అకాల వర్షాల కారణంగా దిగుబడులు తగ్గాయి. దీంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



డిమాండ్ ఎక్కువ..

'మన్యం'లో సాగయ్యే నాణ్యమైన జీడికి మంచి డిమాండ్ ఉంది. అందుకే ఏటా ఉగాది రోజున వ్యాపారులు ధర నిర్ణయించి జీడి పిక్కలను కొనుగోలు చేస్తుంటారు. పలాస, రాయ్‌పూర్, భువనేశ్వర్, తుని వంటి ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. ఈ ఏడాది కూడా

(మిగతా 8వ పేజీలో...)

మామిడి రైతు డీలా

- దిగుబడిపై సన్నగిల్లుతున్న ఆశలు
- మంచు ప్రభావంతో మాడిపోతున్న పువ్వు

6లో

ఇవి మరచిపోలేని క్షణాలు

- గాయని ఎస్పీ శైలజ, శుభలేఖ సుధాకర్
- గురునారాయణ కళాపీఠం జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం



6లో

ఆహారంతోనే ఆరోగ్యం



- ప్రజల్లో ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ
- చిరుధాన్యాల వినియోగంపై ఆసక్తి

రాజాం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి)

'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని చెబుతున్నారు వైద్య నిపుణులు. కొవిడ్ తరువాత ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగింది. సమతుల ఆహారంతో పాటు డ్రైఫ్రూట్స్, చిరుధాన్యాల వినియోగంపై ఆసక్తి పెరిగింది. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలకు విశేష ప్రాధాన్యం ఉంది. మనిషికి సమతుల ఆహారం అందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ సుమారు 75-125 గ్రాముల ఆకుకూరలు, 85 గ్రాముల దుంపలు, 85 గ్రాముల ఇతర కూరలను ఆహారంతో కలిపి తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

● లాభాలివీ..

- కూరగాయల్లో మాంసకృత్తులు, ఖనిజాలు, పిండి పదార్థాలు, విటమిన్లు అధికంగా ఉంటాయి.
- ఇటీవల ప్రజలు ఆకుకూరలు తినడానికి మక్కువ చూపుతున్నారు. అయ్యప్ప, భవానీ దీక్షాధారులు 45 నుంచి 50 రోజులు శాకాహారాన్ని తీసుకుంటున్నారు. దీనివల్ల సాత్వికత అలవడుతుందని వైద్యులు కూడా చెబుతున్నారు.
- సాత్వికాహారం వల్ల మనిషి మానసిక, శారీరక స్థితుల్లో కూడా మార్పు కనిపిస్తుందని ప్రాచీన వైద్య శాస్త్రం చెబుతోంది.

యాంటీ ఆక్సిడెంట్లు అవసరం..

పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డా.హనుమంతరావు అందించిన సమాచారం ప్రకారం.. మానవ శరీరానికి యాంటీ ఆక్సిడెంట్లు చాలా అవసరం. మానవ శరీర ఆరోగ్యానికి అవసరమైన సి విటమిన్, ఇ విటమిన్, బీటా కెరోటిన్, లైకోపిన్ వంటి కీలకమైన పోషకాలను యాంటీ ఆక్సిడెంట్లు అంటారు. ఇవి తాజా పండ్లు, కూరగాయలలో పుష్కలంగా లభిస్తాయి.

- యాపిల్, బత్తాయి, కమలా, ద్రాక్షపండ్లలో సి విటమిన్ ఎక్కువగా ఉంటుంది.
- క్యారెట్, టమాటా, పాలకూర తదితర వాటిల్లో బీటా కెరోటిన్ అధికం. పప్పు ధాన్యాలు, వెన్న తదితర వాటిలో విటమిన్-ఇ పుష్కలంగా ఉంటుంది.
- అరటిపండ్లలో ఇనుము (ఐరన్) ఎక్కువగా ఉంటుంది. ఇవి తినడం వల్ల పొటాషియం ఎక్కువగా చేరి రక్తపోటు (బీపీ)ను నివారించేందుకు అవకాశాలు ఎక్కువ.

చిరుధాన్యాలూ ముఖ్యమే..

ఇటీవల కాలంలో చిరుధాన్యాల వినియోగం పెరిగింది. రాగులు, గంట్లు, చోళ్లు, ఊదలు, అరికెలు, సామలు, కొర్రలు, గంధ్ర కొర్రలను ప్రజలు రోజువారీ ఆహారంలో వాడుతున్నారు. ఇవి కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయని అంటున్నారు.

పెరిగిన డ్రైఫ్రూట్స్ వినియోగం..

గతంలో ఆర్థిక స్థితిమంతులు మాత్రమే వినియోగించే డ్రైఫ్రూట్స్‌పై కరోనా మహమ్మారి విజృంభణ పుణ్యమాని సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు సైతం ఆసక్తి చూపుతున్నారు. రక్తాన్ని పెంపొందించే అంజీర, ఐరన్‌ను పుష్కలంగా వృద్ధి చేసే ఎండు ద్రాక్ష, రక్తకణాలను పెంపొందించే కివి, గుండె జబ్బులను దరిచేరనీయని వాల్‌నట్స్, మధుమేహాన్ని నియంత్రణలో ఉంచే ఆప్రికాట్స్‌తో పాటు అవిసె, గుమ్మడి, పొద్దు తిరుగుడు, పుచ్చ, చియా విత్తనాలకూ డిమాండ్ పెరిగింది.

● వ్యాధులు దూరం..

శాకాహారం వల్ల కొవ్వు పెరగదు. కిడ్నీలో రాళ్లు చేరవు. తేలిగ్గా జీర్ణం అవుతుంది. అన్ని వయసుల వారూ ఎంత తీసుకున్నా పరవాలేదని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారం తినేవారిలో రక్తపోటు, మధుమేహం (సుగర్) వచ్చే అవకాశాలు తక్కువని అంటున్నారు.

● ఈ జాగ్రత్తలు అవసరం..

ప్రస్తుతం ఆహారధాన్యాలు, కూరగాయల పంటల్లో రసాయనాల వాడకం ఎక్కువైంది. దీంతో ఆకుకూరలు, కూరగాయలు వాడుతున్నా రోగాల బారిన పడుతున్నారు. రసాయన ఎరువులు ఎక్కువగా వాడిన కూరగాయల విషయంలో జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయాధికారి రేణుకాసాయి చెబుతున్నారు. ఒకటికి రెండుసార్లు కూరగాయలు, ఆకుకూరలను ఉప్పు, పసుపుతో కడగాలని సూచిస్తున్నారు.

మళ్లీ మోగనున్న బాజాలు



- 6 నుంచి వివాహ ముహూర్తాలు ● అంతటా సందడి

గరుగుబిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల విరామం తరువాత ఈ నెల 6వ తేదీ నుంచి వివాహ శుభకార్యాలు మళ్లీ జరుగనున్నాయి. మార్చి 18 నుంచి మూఢమి కావడంతో 11 రోజుల పాటు శుభకార్యాలకు మంచి ముహూర్తాలు లేవు. మళ్లీ ఈ నెల 6 నుంచి బాజాలు మోగనున్నాయి. ఏప్రిల్ నెలకు సంబంధించి 6, 16, 18, 20, 23, 30 తేదీలలో ముహూర్తాలు ఉన్నాయి. మే నెలలో 1, 8, 9, 11, 17, 18, 28 తేదీలు, జూన్‌లో 1, 2, 5, 6, 7, 8 తేదీలు, జూలైలో 16, 30 తేదీలు, ఆగస్టులో 1, 4, 7, 8, 9, 10, 13, 14, 17 తేదీలు, సెప్టెంబరులో 26, 27 తేదీలు, అక్టోబరు నెలాఖరు వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఆ తరువాత మళ్లీ 2026 ఫిబ్రవరి, మార్చి, జూన్, జూలై, ఆగస్టు, నవంబరు నెల వరకు ముహూర్తాలు ఉన్నాయి. వివాహాల దృష్ట్యా వేసవిలో పలువురికి ఉపాధి అవకాశాలు దొరకనున్నాయి.

మామిడి రైతు డీలా



మాడిపోయిన మామిడి పూత



పూత దశలోని మామిడి చెట్లు

- దిగుబడిపై సన్నగిల్లుతున్న ఆశలు
- మంచు ప్రభావంతో మాడిపోతున్న పువ్వు

కొమరాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):ఈ ఏడాది మామిడి రైతుకు నిరాశే ఎదురవుతోంది. మంచు ప్రభావంతో పూత, పిందెలు రాలిపోతుండడంతో మామిడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. పెట్టుబడులు అధికమవుతున్నాయని.. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉండడం లేదని రైతులు వాపోతు న్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు మామిడి రైతులకు అనుకూలించడం లేదు. గత ఏడాది డిసెంబ రులో రావలసిన మామిడి పూత జనవరి నెలాఖరుకు వచ్చింది. ఆలస్యంగా అయినా పూత విరగబూసింది. దీంతో మామిడి పంట దిగుబడులు పెరుగుతాయని రైతులు ఆనందపడ్డారు. కానీ పూత మాడిపోతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత రాలిపోయి కాడలు కనిపిస్తుండడంతో లబోదిబోమంటున్నారు. ఇప్పటికే దుక్కులు, కూలీలు, మందులు, తదితర వాటి కోసం ఎకరాకు సగటున రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు పెట్టారు. ప్రస్తుతం కురుస్తున్న పొగ మంచు కారణంగా పూత పూర్తిగా మాడిపోతోంది. అక్కడక్కడా పిందెలు ఏర్పడినా అవి కూడా రాలిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల హెక్టార్లలో మామిడి పంటను రైతులు సాగు చేస్తున్నారు. మామిడి తోటలను కొంతమంది కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. కౌలు రేటు కన్నా చీడపీడల కోసం ఖర్చు చేస్తు న్నదే ఎక్కువవుతోందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు.

దిగుబడులు తగ్గవచ్చు..

గత రెండు, మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది మామిడి దిగుబడులు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల పూత మాడిపోవడంతో పాటు పిందెలు రాలిపోతున్నాయి. ఈ కారణంగా దిగుబడులు తగ్గే అవకాశం కనిపిస్తోంది.

-క్రాంతికుమార్, ఉద్యానశాఖ అధికారి, పార్వతీపురం



కస్పా నగరపాలకోన్నత పాఠశాల పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



కలిసి వస్తున్న విద్యార్థులు

వీడలేమంటూ.. వీడుకోలంటూ..

- ముగిసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్ష పూర్తయ్యాక విద్యార్థులు సంబంధిత కేంద్రాల వద్ద సందడి చేశారు. కేరింతలు కొట్టారు. కొందరైతే... స్నేహితులతో విడిపోతున్నందుకు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని మిత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ... బరువెక్కిన హృదయాలతో ఇంటి బాట పట్టారు.

-విజయనగరం కలెక్టరేట్






పరీక్ష కేంద్రం బయట విద్యార్థుల సందడి

ఇవి మరచిపోలేని క్షణాలు

- గాయని ఎస్పీ శైలజ, శుభలేఖ సుధాకర్ ● గురునారాయణ కళాపీఠం జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం

విజయనగరం/విజయనగరం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సినీ వినీలాకాశంలో మెరిసిన ఎంతో మంది మహానుభావులు నడయాడిన విజయనగరంలో జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న క్షణాలు మరచిపోలేనివని సినీ గాయని ఎస్పీ శైలజ, నటుడు శుభలేఖ సుధాకర్‌లు సంతోషం వ్యక్తం చేశారు. గురునారాయణ కళాపీఠం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శైలజా సుధాకర్ దంపతులకు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. స్థానిక ఆనందగజపతి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాయని శైలజ మాట్లాడుతూ ఘంటసాల, పి.సుశీల వంటి వారు ఇక్కడ సంగీత సాధన చేసి.. విజయనగరం కీర్తిని నలుచెరగులా విస్తరింపజేశారని కొనియాడారు. విజయనగరం గడ్డపై గురునారాయణ కళాపీఠం నుంచి జీవిత సాఫల్య పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దక్షిణ భారతదేశంలో మొదటి సంగీత, నృత్య కళాశాలను పూసపాటి వంశీయులు స్థాపించడం కళలపై వారికి గల మక్కువను తెలియజేస్తోందన్నారు. అదే వంశానికి చెందిన అశోక్ గజపతిరాజు, అదితి గజపతిరాజు కళాకారులను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. సినీ నటుడు శుభలేఖ సుధాకర్ మాట్లాడుతూ తన చిత్రాలను ఆదరించడమే కాకుండా, కళలు, కళాకారులకు నిలయమైన విజయనగరంలో సతీమణి శైలజకు, తనకు జీవిత సాఫల్య పురస్కారాలు అందజేయడం తమ జీవితంలో మరచిపోలేని ఘట్టమన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాలకు ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. వివిధ విభాగాల్లో ఎంతో మందిని ఈ సమాజానికి అందించిందని గుర్తు చేసుకున్నారు.



వేదికపై ఉన్న శుభలేఖ సుధాకర్, ఎస్పీ శైలజ, ఎమ్మెల్యే అదితి

ఆకట్టుకున్న గీతాలు

అంతకుముందు సినీ నటి, హరికథా కళాకారిణి కల్యాణి, గురునారాయణ కళాపీఠానికి చెందిన గాయనీ గాయకులు పవన్‌చరణ్, సురభి, శ్రావణి, హారిక, సోనాలి, విష్ణుప్రియ తదితరులు వివిధ చిత్రాల్లోని గీతాలు ఆలపించారు. ఎస్పీ శైలజ 'మయూరి' చిత్రంలోని పాటను పాడి ప్రేక్షకులను రంజింపజేశారు. ఈ కార్యక్రమంలో గురునారాయణ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బీఏ నారాయణ, సినీ దర్శకుడు ఇమంది రామారావు, కళాపీఠం సభ్యులు పి.సన్యాసమ్మ, యార్లగడ్డ బాబూరావు, లలిత, సాంబశివరావు, నాగేంద్రప్రసాద్, గౌరీ శంకర్. జి.శివ తదితరులు పాల్గొన్నారు.



పైడిమాంబను దర్శించుకుంటున్న సుధాకర్, శైలజ

పైడిమాంబను దర్శించుకున్న సుధాకర్ దంపతులు

విజయనగరం వచ్చిన ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, నటుడు శుభలేఖ సుధాకర్‌లు మూడులాంతర్లు వద్ద ఉన్న పైడిమాంబ ఆలయంలో మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది ప్రసాదాన్ని, పైడిమాంబ చిత్రపటాన్ని వారికి అందజేశారు.

కలగానే రామతీర్థం బైపాస్ రోడ్డు

●ఫైళ్లలోనే ప్రతిపాదనలు ● భక్తులు, స్థానికులకు తప్పని కష్టాలు

నెల్లిమర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలోని బోడికొండను ఆనుకుని బైపాస్ రోడ్డు నిర్మాణం కలగా మిగిలింది. రామతీర్థం దేవస్థానానికి భక్తుల రాక, జాతరలు జరుగుతున్న దృష్ట్యా వాహనాల రాకపోకలకు వీలుగా బోడికొండను ఆనుకుని రామతీర్థానికి బైపాస్ రోడ్డు నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. నెల్లిమర్ల నుంచి రణస్థలానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు రామతీర్థం గ్రామం మధ్య నుంచి ఉండటంతో వాహనాల రాకపోకలతో స్థానికులు నిత్యం అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా రామతీర్థంలోని రామస్వామివారి దేవస్థానంలో జరిగే ఉత్సవాల సమయంలో ఈ రోడ్డు భక్తులతో నిండిపోవడంతో ట్రాఫిక్ స్తంభించడం సర్వసాధారణం. ఏటా శివరాత్రి, ఆ మరుసటి రోజున లక్షలాది మందితో జరిగే పెద్ద జాతర సమయంలో రామతీర్థం ఆవల ఉన్న గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు రామతీర్థం దాటడం సాహసమే. ఈ ఉత్సవాల సమయంలో ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని రామతీర్థం గ్రామం మధ్యలో నుంచి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును శాశ్వతంగా దారి మళ్లించాలనే ఆలోచనతో గత ఎన్నికల సమయంలో బైపాస్ రోడ్డును నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటించారు. ఆ హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ఉత్సవాల సమయంలో సమీపంలోని సీతారాముడిపేట-దన్నానపేట రోడ్డును ప్రజలు, ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బైపాస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.



బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాల్సిన ప్రాంతం

కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట

చీపురుపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమం కోసం పనిచేయడంలో టీడీపీ ఎల్లప్పుడు ముందుంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. మండలంలోని విజయరాంపురంలో పార్టీ కార్యకర్తలకు ఆయన మంగళవారం పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.అంతకు ముందు ఆయన పుర్రేయవలసలో పేదలకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, సర్పంచ్‌లు పనస జానకిరామ మణికంఠ, ఎస్.మోహనరావు, రెడ్డి లక్ష్మణరావు, మహంతి అప్పలనాయుడు, రేగిడి వాసు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన జనసేన నాయకులు

నెల్లిమర్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జరజాపుపేటలోని అర్బన్ పీహెచ్‌సీని ఎమ్మెల్యే పీఏ రాజు, నెల్లిమర్ల అర్బన్ జనసేన నాయకులు మంగళవారం సందర్శించారు. పీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ కల్పనతో మాట్లాడారు. పీహెచ్‌సీలో ఎటువంటి సమస్యలు ఉన్నా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని కోరారు. వారి వెంట నెల్లిమర్ల అర్బన్ జనసేన నాయకులు ఎంఎం.నాయుడు, రవ్వా నాని, అప్పికొండ రవికుమార్, పాండ్రంకి సత్యనారాయణ, మాత మురళీమోహన్, సుంకరి ముత్యాలప్పుడు, కొండపేట శంకర్, మద్దిల అప్పన్న, కాళ్ల మహేశ్, పి.బాషా తదితరులున్నారు.

గ్రామసభలు సక్రమంగా నిర్వహించండి

శృంగవరపుకోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభలు సక్రమంగా నిర్వహించాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు దొడ్డి సూర్యారావు కోరారు. మంగళవారం ఆయన శృంగవరపుకోటలో విలేకరులతో మాట్లాడారు. ఏటా జరుగుతున్న గ్రామసభలు మొక్కుబడిగా జరుగుతున్నాయన్నారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి నుంచి నిర్వహించనున్న గ్రామ సభలు ఆదర్శంగా జరిగేలా రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకోవాలని లేఖ రాస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు సన్యాసప్పడు, సూర్యదేముడు, సాంబమూర్తి తదితరులున్నారు.

కొండలరావుకు సత్కారం

బొండపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నిస్వార్థంగా సేవలు అందించిన ఘనత ఉపాధ్యాయుడు డీఎంఆర్ కొండలరావుకు దక్కుతుందని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. మండలంలోని అంబటివలసలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కొండలరావు పదవీవిరమణ సత్కార సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. కొండలరావు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కొండలరావును సత్కరించారు. కార్యక్రమంలో కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంసీహెచ్ గౌరీశంకరరావు, సర్పంచ్ పాలూరు రామునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపూడి అప్పలనాయుడు, నాయకులు రౌతు చిన్నా, రౌతు శ్రీనివాసరావు, టి.సన్యాసప్పడు, మాజీ సర్పంచ్ శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దైవారాధనతో మంచి భావాలు

గంట్యాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) నిత్య దైవారాధన చేపట్టే గ్రామాల్లో అభివృద్ధి కుసుమాలు వికసిస్తాయని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. మండలంలోని చంద్రంపేటలో ఏడు రోజుల పాటు నిర్వహిస్తున్న హరే రామ హరేకృష్ణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని సేవలో ఉన్నవారికి ప్రజలు మంచి భావాలు, ఆలోచనతో ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద వాసుదేవరావు ఉన్నారు.

ఉపాధితో రైతులకు మెరుగైన సేవలు

గజపతినగరం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంతో రైతులకు మెరుగైన సేవలు అందజేస్తున్నామని మండల ప్రత్యేక అధికారి బి.రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని కాళంరాజపేటలో పాడి పశువులకు నీటి తొట్టెల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.కల్యాణి, డీటీ శోభ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో మంత్రి

బొండపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తవలసలో మంగళవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, ఎంపీడీవో గిరిబాల, సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, నాయకులు కోరాడ కృష్ణ, నంబూరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట రూరల్: మండలంలోని కొత్తూరులో మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, జీఎస్ నాయుడు, రామసత్యం ఉన్నారు.

పంచ ప్రాధాన్యాలపై దృష్టిపెట్టండి

జామి, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పంచ ప్రాధాన్యాల పనులైన పశువులకు నీటి తొట్టెలు, సేద్యపు నీటికుంటలు, పంట కాల్వల పునరుద్ధరణ, చెరువులు-కుంటల సమగ్ర అభివృద్ధి, దినసరి వేతనం రూ.300లపై సంబంధిత అధికారులు చిత్తశుద్ధి ప్రదర్శించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని తాండ్రంగిలో డ్వామా పీడీ శారదాదేవి ఆధ్వర్యంలో నీటి తొట్టెల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విజినిగిరి, వెంకటరాజుపాలెం గ్రామాలను సందర్శించి పంచ ప్రాధాన్యాలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, జడ్పీ సీఈవో సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి కుమారస్వామి, తహసీల్దార్ కృష్ణలత, ఎంపీడీవో అప్పలనాయుడు పాల్గొన్నారు.



భూమిపూజలో కలెక్టర్ అంబేడ్కర్

భక్తులకు అసౌకర్యం కలగనివ్వొద్దు

నెల్లిమర్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో ఈ నెల 6న శ్రీరామ నవమి సందర్భంగా కల్యాణోత్సవానికి ఏర్పాట్లను పక్కాగా చేయాలని ఆర్డీవో కీర్తి అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. మంగళవారం రామతీర్థంలోని దేవస్థానంలో కల్యాణోత్సవం ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారన్నారు. అదే ఉదయం 10.30 గంటలకు స్వామివారికి కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో దేవదాయ శాఖ ఈవో, అసిస్టెంట్ కమిషన్ వై.శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు సాయిరామాచార్యులు, జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీఈవో వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రామకృష్ణరాజు, తహసీల్దార్ సుదర్శనరావు డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఫైర్ అధికారి రాంప్రకాశ్, ప్రజాప్రతినిధులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, సర్పంచ్ రాము పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో కీర్తి

పింఛన్‌తో ఆర్థిక భద్రత

విజయనగరం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్‌తో ఆర్థిక భద్రత లభిస్తోందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. మంగళవారం ఆమె కొండకరకాం, 14వ డివిజన్ కురాకుల గట్టు, 13వ డివిజన్ బంగారమ్మ చదురు వద్ద నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. కొండకరకాంలో ఎంపీడీవో గంటా వెంకటరావు, 14, 13 డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్వి, బీజేపీ నాయకుడు సుధీర్, 14వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి మద్దాల నాగమ్మ, 13వ డివిజన్ ఇన్‌ఛార్జి చందక స్వప్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

ఘనంగా 'అవంతి' వార్షికోత్సవం

గరివిడి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక అవంతీస్ సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదల, కృషితో పాటు మంచి నైపుణ్యం, క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు. అనంతరం గుర్ల సిద్ధయోగ ఆశ్రమం బ్రహ్మర్షి స్వామి లక్ష్మణానంద పరమహంస, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు మాట్లాడారు. కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, చీపురుపల్లి సీఐ జి.శంకరరావు, గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావు, అవంతి విద్యా సంస్థల ప్రతినిధి ఎం.మహేశ్, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏవో జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఫాంపాండ్స్‌తో భూగర్భజలాల పెంపు: మంత్రి

గంట్యాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలు పెంపొందించుకోవడానికి ఉపాధి హామీ పథకంలో నిర్మిస్తున్న ఫాంపాండ్స్ దోహదపడతాయని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తవెలగాడలో నిర్మించిన ఫాం పాండ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. గోశాలలు అధిక సంఖ్యలో మంజూరు చేస్తున్నామన్నారు. ప్రతి వేతనదారుడు సగటున రూ.300 కూలీ వచ్చే విధంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలోని సర్పంచ్ దాలమ్మ, ఎంపీడీవో రమణమూర్తి, ఏపీవో సుందరరావు, ఎంఈవో విజయకుమారి, డిప్యూటీ తహసీల్దార్ రంజిత్‌కుమార్, పీఆర్ జేఈ కృష్ణమూర్తి, వ్యవసాయ అధికారి శ్యామ్‌కుమార్, హౌసింగ్ జేఈ రాజగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నానిబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, తాటిపూడి ఆయకట్టు ఛైర్మన్ జగన్నాథం, టీడీపీ నాయుకులు అల్లు విజయకుమార్, రొంగళి కృష్ణ, రంది చినరామునాయుడు, కాళీ ఉన్నారు.



ఫాంపాండ్ ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

పశువులకు నీటి ఎద్దడి తప్పించండి

లక్కవరపుకోట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి నుంచి పశువులను రక్షించుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మంగళవారం మండల పశువైద్య కేంద్రం ఆవరణలో నీటి తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 22వేల ఉపాధి హామీ నిధులతో తొట్టెను నిర్మించి నీటి ఎద్దడి నుంచి పశువులను రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ రమణమూర్తి, ఏపీవో విజయలక్ష్మి, పశువైద్యులు కె.గాయత్రి, కళ్లద్దాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

●వేపాడ: వేసవి దృష్ట్యా మూగ జీవాలకు తాగునీటి కష్టాలు లేకుండా చేసేందుకే ప్రభుత్వం నీటి తొట్టెలు నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని జాకేరులో నిర్మించనున్న నీటి తొట్టెకు మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, ఏపీవో ఆదిలక్ష్మి, మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, సర్పంచ్ ముద్ద చిన్నమ్మలు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఆక్రమణల తొలగింపు

సంతకవిటి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో అప్పలగ్రహారంలో మంగళవారం రెవెన్యూ అధికారులు భూ ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించారు. అప్పలగ్రహారంలో సర్వే నెంబర్ 70-1 విస్తీర్ణం ఒకటన్నర సెంటు, 71-1 విస్తీర్ణం ఒక సెంటు, భూమిని ముగ్గురు వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఇటీవల గ్రామస్థులు తహసీల్దార్ బి.సత్యం, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ వారు స్పందించక పోవడంతో మంగళవారం పోలీసులు బందోబస్తుతో ఆక్రమణ స్థలానికి అధికారులు చేరుకున్నారు. హద్దులు గుర్తించిన సమయంలో ఆక్రమణదారులు పోలీసులు, అధికారులపై దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులు సీఐ ఉపేంద్రకు తెలిపారు. దాంతో రేగిడి ఆమదాల వలస ఎస్ఐ, సంతకవిటి ఎస్ఐ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు. ఎక్స్‌కవేటర్ సాయంతో ఆక్రమణలను తొలిగించారు.



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

పింఛన్ సొమ్ము చోరీ

సంతకవిటి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లిలో స్కూటీలో ఉంచిన పింఛన్ సొమ్మును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం చోరీ చేశారు. గ్రామ సచివాలయానికి చెందిన వ్యవసాయ అధికారి నవ్య మంగళవారం పింఛన్లు పంపిణీ చేస్తుండగా తన స్కూటీలోని రూ.20 వేలు చోరీకి గురయ్యాయి. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి కె.కోటీశ్వరరావు ఎంపీడీవో సురేష్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఎంపీడీవో సలహా మేరకు పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

మెరకముడిదాం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని బుదరాయవలస ఎస్ఐ లోకేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గొట్టిపల్లి, నర్సియ్యపేట, సింగవరం, మెరకముడిదాం గ్రామాల్లో సంకల్ప రథం నిలిపి మాదకద్రవ్యాల వల్ల అనర్థాలను వివరించారు. లఘుచిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలులో రాజాం మూడో స్థానం

●రూ. 3.41 కోట్లకు గాను రూ.2.86 కోట్లు వసూలు చేసి రాష్ట్రస్థాయిలో గుర్తింపు

రాజాం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూలులో రాజాం మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. ఆస్తి పన్ను వసూలులో రాష్ట్రంలో వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ, వినుకొండ మున్సిపాలిటీ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా, రాజాం మున్సిపాలటీ 83.94 శాతం పన్ను వసూలుతో మూడో స్థానంలో నిలిచినట్టు ప్రభుత్వం ప్రకటించింది. రాజాం మున్సిపాలిటీ పరిధిలో రూ.3.41 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ.2.86 కోట్లు వసూలు చేసి 83.94 శాతం లక్ష్యం సాధించింది. గత ఏడాదికి చెందిన బకాయిలు రూ.72 లక్షలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిమాండ్ రూ.2. 69 కోట్లకు గానూ మొత్తం రూ. 2.86 కోట్లు వసూలు చేసింది. పన్ను వసూలు విషయంలో కమిషనర్ జె.రామప్పలనాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. మేనేజరు శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ ప్రతీవారం సమీక్ష నిర్వహించారు. మార్చి వచ్చేసరికి కమిషనర్ వేగం పెంచారు. క్షేత్రస్థాయికి వెళ్లడం ప్రారంభించారు. వారంలో ఒకరోజు అన్ని విభాగాలు, మెప్మా అధికారి ఎంవీ రత్నం నోడల్ అధికారిగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బందిని కూడా పన్ను వసూలుకు డ్యూటీలు వేశారు. కార్యాలయంలో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి మొదటి వంద మంది బకాయిలు జాబితా తీసుకుని వారికి నిత్యం ఫోన్లు చేయించేవారు. అందరి సహకారంతోనే లక్ష్యం సాధించి రాష్ట్రస్థాయిలో మూడో స్థానం రావడం సంతోషంగా ఉందని కమిషనర్ రామప్పలనాయుడు తెలిపారు.



రాజాం మున్సిపల్ కార్యాలయం

147 కిలోల గంజాయి స్వాధీనం

●నలుగురి అరెస్టు ●ఎస్పీ వకుల్ జిందాల్

రామభద్రపురం, విజయనగరం క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద గంజాయితో కారు వదిలి పరారైన నలుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిబ్రవరి 10న రామభద్రపురం ఎస్ఐ వి.ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. ఇంతలో కారులో వస్తున్న కొంతమంది వ్యక్తులు పోలీసులను చూసి కారు విడిచిపెట్టి పరారయ్యారు. విడిచిపెట్టిన వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా కారులో 147 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయిని, కారును స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి పరారైన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈక్రమంలో విశాఖ జిల్లా ఆనందపురం మండలం దుక్కవానిపాలెంకు చెందిన భోగవల్లి గోవిందరావు, చగురుపల్లి అనీల్‌కుమార్, బంక రామ్‌సురేష్, అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచుంగుపుట్టి మండలం కిలగడ గ్రామానికి చెందిన అంబడి బాలరాజులను పట్టుకుని, అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అనంతగిరి మండలం శివలింగాపురానికి చెందిన శక్తి ఉమా మహేశ్వరరావు ఇదివరకే గంజాయి కేసులో అరస్టయి జైలులో ఉన్నాడు. వీరి నుంచి 147 కిలోల గంజాయితోపాటు 4 మొబైల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో క్రియాశీలంగా పనిచేసిన బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, రామభద్రపురం ఎస్ఐ వి.ప్రసాదరావు, రామభద్రపురం కానిస్టేబుళ్ల వై.రమేష్, ఎస్.రవి, ఎ.ధర్మారావు, పి.నాగార్జునలను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సమావేశంలో బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, ఎస్పీ, సీఐలు ఏవీ లీలారావు, ఆర్‌కే చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

మచిలీపట్నంలో జిల్లా కూలీ మృతి

సీతంపేట రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్లాడ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు పూయక రాహుల్(20) కూలి పనుల కోసం వలస వెళ్లి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు.. కిల్లాడ గ్రామానికి చెందిన పూయక తిరుపతిరావు, నిర్మలమ్మ కుమారుడైన రాహుల్ బతుకు తెరువు కోసం ఇటీవల మచిలీపట్నం వెళ్లాడు. అక్కడ చేపల చెరువు కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. అయితే సోమవారం అక్కడ పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. చేతికి అందివచ్చిన కొడుకు ఈవిధంగా అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోధించారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

నెల్లిమర్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో బైరెడ్డి వీధి, నాయుడు కాలనీ, కీర్తివీధుల్లో మహిళలు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపారు. ఐదు రోజులుగా తాగునీరు కుళాయిల ద్వారా రావడం లేదన్నారు. నగర పంచాయతీ అధికారులకు విషయం తెలియజేసినా వారు పట్టించుకోవడంలేదున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే కుళాయిల ద్వారా మంచినీరు ఇవ్వాలని కోరారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తాగునీటి సమస్య పరిష్కరించండి

దత్తిరాజేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుచ్చిమి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కండిపల్లి భీముడు, ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు . మంగళవారం ఎంపీడీవో వైవి.రాజేంద్ర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. కిలోమీటరు మేరకు నడిచి వెళ్లి మంచినీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని చెప్పారు. వెంటనే తాగునీటి సమస్య తీర్చాలన్నారు. అలాగే ఉపాధి బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. రోజువారీ వేతనం రూ.600, పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

'స్మార్ట్ మీటర్లు వద్దు'

విజయనగరం క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ నగరంలో ఇంటింటికి స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని, ఇంటికి స్మార్ట్ మీటర్ పెడితే తొలిగిస్తామని చెప్పిన హామీ ఏమైందని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు రమణమ్మ, బి.రమణ, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

దోపిడీదారులపై పోరాడుదాం

విజయనగరం క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న పాలకుల విధానాలు, సామ్రాజ్యవాదుల దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడదామని నవయుగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరరావు అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఎన్‌వైఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.అప్పలరాజు అధ్యక్షతన భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ గాంధీజీ చెప్పిన అహింస మార్గం చివరికి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకే ఉపయోగపడిందన్నారు. భగత్‌సింగ్ విప్లవ సహచరులు, యువకులు, విద్యార్థులను సమీకరించి వాళ్లలో దేశభక్తిని పెంచడానికి భారత్ నౌజవాన్ సంస్థను స్థాపించామన్నారు. మహనీయుల ఆశయాలను నేటి యువత అర్థించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

విధుల నుంచి ఎండీయూ ఆపరేటర్ తొలగింపు

భోగాపురం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ పరిధిలోని ఎండీయూ ఆపరేటర్ నారాయణరావును విధుల నుంచి తొలగించినట్టు సీఎస్ డీటీ బి.వి.మురళీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నారాయణరావు రేషన్ కార్డుదారులకు సరుకులు సక్రమంగా సరఫరా చేయకపోవడం, నిర్ధిష్ట సమయంలో స్టాకు వివరాలు నమోదు చేయకపోవడం, అమ్మకాలు చేసిన నగదు డీలర్‌కు ఇవ్వకపోవడం వంటి కారణాల నేపథ్యంలో షోకాజ్ నోటీస్ జారీ చేశామన్నారు. దానికి నారాయణరావు సమాధానం ఇవ్వకపోవడంతో విధుల నుంచి తొలగించామన్నారు. ఆపరేటర్‌ను నియమించే వరకు భోగాపురంలో చౌకధరల దుకాణాల వద్దే సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు.

ధర బాగున్నా.. దిగుబడి లేదు

(5వ పేజీ తరువాయి)

వ్యాపారులు గ్రామాల్లోకి వెళ్లి గిరిజనుల వద్ద పంటను కొనుగోలు చేసి పట్టణ ప్రాంతాల్లో విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే గత ఏడాది లానే ఈ సారి కూడా ఆశించిన స్థాయిలో జీడి దిగు బడులు లేకపోవడంతో గిరిజనులు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతపండు ధర కూడా కిలో రూ.60 వరకు పలుకుతున్నప్పటికీ దిగుబడి లేదని వారు వాపోతున్నారు.

కొనుగోలుకు సిద్ధం

ఉన్నతాధికారులు ఆదేశిస్తే జీడిపిక్కలను జీసీసీ ద్వారా కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే గిరిజన రైతుల నుంచి అనేక అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాం.

- కృష్ణ ప్రసాద్, జీసీసీ మేనేజర్, గుమ్మలక్ష్మీపురం

గిట్టుబాటు ధర కల్పించాలి

జీసీసీ లేదా వెలుగు సంస్థల ద్వారా గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పించాలి. చింతపండు మాదిరిగా జీడి పిక్కలను కొనుగోలు చేయాలి. గిరిజన ప్రాంతంలో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలి.

- ఎం.ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, కొండవాడ

టౌన్ ప్లానింగ్‌లో అవకతవకలపై పదిమందికి తాఖీదులు

బొబ్బిలి ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీలో గతంలో పనిచేసిన ఇద్దరు కమిషనర్ల హయాంలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవత వకలు జరిగినట్టు నిర్ధారణ కావడంతో మొత్తం పదిమంది అధికారులు, ఉద్యోగులకు ప్రభుత్వం తాఖీదులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది అధికారులకు మంగళవారం తాఖీదులు జారీ చేసిన నేపథ్యంలో బొబ్బిలి మున్సిపాలిటీలో పనిచేసిన వారికి కూడా జారీ అయ్యాయి. 2022 ఆగస్టు 4న బొబ్బిలి మున్సిపాలిటీలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అప్పట్లో టౌన్‌ప్లానింగ్ విభాగంలో రికార్డులను కూడా అధికారులు తమ వెంట తీసుకెళ్లి పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా భవనాల నిర్మాణాలు జరిగినట్లు, అనుమతులను ఇష్టారాజ్యంగా మంజూరు చేసినట్లు ఆ తనిఖీలో గుర్తించినట్లు తెలిసింది. దీని ప్రకారం గతంలో పనిచేసిన ఇద్దరు మున్సిపల్ కమిషనర్లు సత్తారు శ్రీనివాసరావు, ఎంఎం నాయుడుతో పాటు మరో ఇద్దరు టౌన్‌ప్లానింగ్ అధికారులు వరప్రసాద్, బాలరాజు, ఇద్దరు గుమస్తాలు, ఆరుగురు టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలను బాధ్యులుగా గుర్తించి వారిపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించేందుకు అవసరమైన ఉత్వర్వులు వెలువడినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఏసీబీ అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు ప్రభుత్వం స్పందిస్తూ బాధ్యులపై చర్యలకు ఉత్తర్వులు జారీ చేసింది.

రూ.4.83కోట్ల ఆస్తి పన్ను వసూలు

బొబ్బిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీలో ఈ ఏడాది మార్చి నెలాఖరుకు రూ.4.83 కోట్ల ఆస్తిపన్ను, రూ.65లక్షల కుళాయి పన్ను వసూలైనట్టు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. గత ఏడాది రూ.4.05 కోట్లు వసూలైందని, ఈ ఏడాది 78.7 శాతం పన్ను బకాయిలు వసూలయ్యాయని తెలిపారు. మొత్తం 14,300 అసెస్‌మెంట్ల నుంచి ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిల డిమాండ్ రూ.7.44 కోట్లు అని ఆమె తెలిపారు. వీటిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఆస్తి పన్ను రూ.కోటిన్నర ఉందన్నారు. కుళాయి పన్నుల రూపేణా రూ.కోటిన్నర వసూలు కావాల్సి ఉండగా గత ఏడాది రూ.30లక్షలు వసూలైతే ఈ ఏడాది రెట్టింపునకు పైగా రూ.65లక్షల మేర వసూలైనట్టు ఆమె తెలిపారు. కుళాయి కనెక్షన్లకు సంబంధించి అనేక ఆరోపణలు ఉన్నందున వాటన్నిటిపైనా ప్రత్యేక దృష్టి సారించి సరి చేస్తామన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మంగళవారం బొబ్బిలిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఈ సంవత్సరానికి గాను పన్నుల లక్ష్యం రూ.50,19,342 కాగా, రూ.42,6,440(85 శాతం) వసూళ్లయ్యాయని ఆయన తెలిపారు. ఇంకా చెల్లించని వారికి ఏప్రిల్ 10 వరకూ గడువు ఇచ్చామన్నారు. ఆ తర్వాత కూడా మిగిలిపోతే మళ్లీ సంవత్సరానికి బదిలీ అయిపోతుందని చెప్పారు.

10 నుంచి జూట్ మిల్లులో నిర్వహణ పనులు

కొత్తవలస, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి పంచాయతీ సీతంపేటలోని ఉమ జూట్ మిల్లు సమస్యకు మంగళవారం రాత్రి తెరపడింది. సుమారు 10 నెలలుగా మూతపడిన జూట్ మిల్లును ఈనెల 7 నుంచి ప్రారంభించడానికి యాజమాన్యం అంగీకరించింది. దాంతో సుమారు 400 మంది కార్మికుల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి ఇందుకు సంబంధించి మంగళవారం రాత్రి యాజమాన్యం, కార్మికసంఘం మధ్య ఒప్పందం కుదిరింది. అగ్రిమెంట్‌పై ఇరువర్గాలు సంతకాలు చేశారు. చాన్నాళ్లుగా మిల్లు తెరవాలంటూ కార్మికులు పోరాటాలు సాగిస్తున్నారు. పలుమార్లు కార్మికశాఖకు చెందిన అధికారుల వద్ద చర్చలు జరిగాయి. ఎట్టకేలకు యాజమాన్య ప్రతినిధులలో ఒకరైన తీగెల సుబ్బారావు(చిన్ని) మిల్లు తెరవడానికి అంగీకరించారు. ఈనెల 7వ తేదీన మిల్లులో గణపతి హోమం చేసి 10 నుంచి నిర్వహణ పనులు చేయడానికి నిర్ణయించారు. 23 నుంచి మిల్లులో తిరిగి ఉత్పత్తిని ప్రారంభించడానికి అంగీకారం కుదిరింది. చర్చల్లో కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పండా, నాయకుడు రాంబాబు, యాజమాన్యం ప్రతినిధులు తీగెల పెద్ద అన్నాజీరావు, సప్తగిరి, తీగెల సుబ్బారావు పాల్గొన్నారు.

వర్గీకరణతో ఉపకులాలకు మేలు

బాడంగి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ ద్వారా ఉప కులాలకు మేలు చేకూరుతుందని, తద్వారా సామాజిక న్యాయం సకారం అవుతుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీను అన్నారు. ఈసందర్భంగా ఆయన బాడంగిలో మంగళవారం మాట్లాడారు. వర్గీకరణకు పూర్తి సహకారం అందించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వానికి మంద కృష్ణమాదిగ పేరిట కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ప్రస్తుతం లేనందున త్వరగా ఆర్డినెన్స్ ఇచ్చి విద్య, ఉద్యోగ రంగాలలో ఏ, బీ, సీ రిజర్వేషన్ అమలయ్యేలా చొరవ తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కిల్లాడ సురేంద్రబాబు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కనిగిరి చంటి, సలహాదారుడు అనకాపల్లి నాగేశ్వరరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ బోడెల రవి, కోశాధికారి బల్లంకి కృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల యుగంధర్, మండల అధ్యక్షుడు భోగి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్‌తో ప్రయోజనం

బలిజిపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రైమరీ స్కూల్స్‌తో ఒకటి నుంచి 5 తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉందని ఎంఈవో సామల సింహాచలం తెలిపారు. మంగళవారం మిర్తివలస ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఎంసీ సభ్యులకు ఆయన ఈ పాఠశాల నిర్వహణపై అవగాహన కల్పించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో ప్రతి తరగతికి ప్రభుత్వం ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తుందని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ సభ్యులు తమ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రైమరీ పాఠశాలలకు 3, 4, 5 తరగతుల పిల్లలను పంపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.అప్పారావు, వార్డు మెంబరు త్రినాథనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంద రోజుల పని కల్పించాలి

బొబ్బిలి ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులకు సంవత్సరానికి కనీసం వంద రోజుల పనిదినాలు కల్పించి రోజుకి రూ.300 చొప్పున వేతనం చెల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.గోపాలం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ ఏడాది జనవరి నుంచి మూడు నెలల పాటు చేపట్టిన పనులకు గాను వేతనదారులకు బిల్లులు చెల్లించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- **మంత్రి సంధ్యారాణి**
- **సామాజిక పింఛన్ల పంపిణీ**



సాలూరు: పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని రామాకాలనీలో మంగళవారం ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆర్టీసీ డిపోలో నూతన బస్సును తానే స్వయంగా నడిపి ప్రారంభించారు.



బాడంగి: ఆకులకట్టలో పింఛన్ అందజేస్తున్న బుడా చైర్మన్ తెంటు

ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సూర్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కౌన్సిలర్లు హర్షవర్ధన్, లక్ష్మోజీ, నటరాజ్, అప్పయమ్మ తదితరులు పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం: ప్రజల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం జేకేపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదును అందించారు. ఎంపీడీవో సాల్మన్‌రాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ క ద్రక కళావతి, టీడీపీ మండల కన్వీనర పాడి సుదర్శన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● కురుపాం రూరల్: మండలంలోని ఆవిరి, వలసబల్లేను గ్రామాల్లో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించారు. పశువుల నీటి తొట్టెలను ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ కళావతి, పార్టీ నాయకులు కడాయి, సుదర్శనరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ● బొబ్బిలి: పట్టణంలోని నాలుగో వార్డులో ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, ఆరో వార్డు కౌన్సిలరు గెంబలి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరిశర్ల రామారావు, మాజీ కౌన్సిలర్ పసుమర్తి గౌరు తదితరులు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: కొత్తపెంట గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే బేబీనాయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో పి.రవికుమార్, అధికారులు పాల్గొన్నారు. ● బాడంగి: ఆకులకట్ట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు మంగళవారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తెంటు రవి, వైస్ ఎంపీపీ భాస్కరరావు, పార్టీ నాయకుడు అప్పలనాయుడు, సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పశువుల దాహార్తిని తీర్చేందుకు..

- **ఉపాధి నిధులతో నీటితొట్టెల పనులు ప్రారంభం**



గుమ్మలక్ష్మీపురం: నీటితొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి



పార్వతీపురంరూరల్: వెంకంపేట భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



బొబ్బిలి రూరల్: కొత్తపెంటలో నీటితొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా పశు పక్షాదుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం నీటితొట్టెల నిర్మాణాన్ని తలపెట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. చెముడు గ్రామంలో ఆమె మంగళవారం నీటితొట్టెల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీడీవో సాల్మన్‌రాజ్, ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి, టీడీపీ మండల కన్వీనర్ పాడి సుదర్శన్, అధికారులు పాల్గొన్నారు. ● పార్వతీపురం రూరల్: వెంకంపేట గ్రామంలో ఉపాధి నిధులతో పశువుల కోసం నిర్మించ తలపెట్టిన తాగునీటి తొట్టెలకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● పార్వతీపురం పట్టణంలోని ఆరో వార్డు నవిరి కాలనీలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఉన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని, అలాగే మున్సిపల్ కేంద్రంలో శుద్ధినీటి కేంద్రాన్ని ప్రారంభించా రు. ● బొబ్బిలి రూరల్: పశువులకు పశుగ్రాసంతో పాటు తాగునీటిని అందజేసేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నీటితొట్టెలు మంజూరు చేస్తోందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మంగళవారం కొత్తపెంట గ్రామంలో నీటితొట్టెల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో పి.రవికుమార్, ఆవోపీఆర్డీ భాస్కరరావు, ఉపాధి ఏపీవో లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు. ● వీరఘట్టం: కంబర గ్రామంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు మంగళవారం పశువుల నీటితొట్టి పనులను ప్రారంభించారు. ఏపీవో జి.సత్యంనాయుడు పాల్గొన్నారు. ● బలిజిపేట: తుమరాడలో నీటితొట్టెల ఏర్పాటుకు మంగళవారం స్థానిక అధికారులు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో నగేష్, ఏపీవో కేశవరావు, ఈవోపీఆర్డీ పుష్పారావు తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి సదరం ప్రారంభం

గరుగుబిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఈమేరకు ఈనెల 4వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో అర్హులైన వారు నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో నకిలీ ధ్రువీకరణ పత్రాలను పొంది అధికంగా పింఛన్లు పొందుతున్న పరిస్థితి నెలకొంది. పరిశీలనకు ప్రత్యేక తనిఖీలను చేపడుతున్నారు. అలాగే సదరానికి సంబంధించి గత కొద్ది నెలలుగా నిలుపుదల చేశారు. ప్రస్తుతం ఈనెల 4 నుంచి ప్రారంభం కావడంతో అర్హులైన వారు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన



అల్పాహారాన్ని రుచి చూస్తున్న కమిషనర్ జయరాం

పాలకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం, చైర్మన్ పల్లా ప్రతాప్ మంగళవారం పరిశీలించారు. క్యాంటీన్‌లోని ఆహార పదార్థాలను రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార పదార్థాలు వడ్డించే విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రోజుకు ఎంతమందికి ఆహారం వస్తుంది.. ఎంత మేర సరఫరా అవుతుందన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు.

తాగునీరు పునరుద్ధరణ

మక్కువ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన, గోపాలపురం, గోడెవలస గ్రామాల ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారని ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కోన, బంగారువలస రహదారి నిర్మాణ పనుల కారణంగా రక్షిత తాగునీటి పథకం పైపులైన్లకు రంధ్రాలు పడిన ప్రదేశాన్ని ఎంపీడీవో స్వరూపారాణి మంగళవారం పరిశీలించారు. పైపులైన్లకు పడిన రంధ్రాలకు దగ్గరుండి బాగు చేయించి, ఆయా గ్రామాలకు తాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జోగారావు ఉన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మక్కువ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పనసభద్ర పంచాయతీలో దుగ్గేరు నుంచి మొండంగి వరకు రూ.కోటి 20 లక్షలతో నిర్మించిన రహదారిని ఆమె మంగళవారం ప్రారంభించారు. మంత్రికి స్థానికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. అడారు గడ్డప రహదారి, కాజ్‌వే నిర్మాణానికి రూ.3కోట్ల 50లక్షలతో అంచనాలు రూపొందించామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజన్నదొర సొంత ఊరికి రహదారి, పాఠశాల లేకపోవడం సిగ్గుచేటన్నారు. మండలంలో కొత్తగా మూడు రహదారుల నిర్మాణానికి రూ.8కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సాలూరు మండలం కందుల పథం పంచాయతీ మర్రివానివలసకు చెందిన వాటిక ఐశ్వర్య హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులను మంత్రి అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడు, సర్పంచ్ సీదరపు గంగమ్మ, ఐటీడీఏ ఈఈ మణిరాజ్, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, టీడీపీ నాయకులు డాక్టర్ పి.మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి



బొబ్బిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

బొబ్బిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతికి నిరసనగా బొబ్బిలి పట్టణంలో మంగళవారం బాప్టిస్ట్ ఫీల్డు కౌన్సిల్, బొబ్బిలి పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఆయా సంఘాల అధ్యక్షులు వింజమూరి విజయ్‌కుమార్, జయరాజు, బాబూరావు, పాస్టర్ అశోక్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహిం చారు. ఈ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, దోషులను కఠిన శిక్షించాలని వారు కోరారు. అనంతరం స్థానిక కోటకు వెళ్లి ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్.శివమాస్టర్, మోహన్, ప్రవీణ్, ప్రదీప్, రామకృష్ణ, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా లింకు రోడ్లు.. వాహనదారులకు ఇక్కట్లు



ట్రాక్టర్ ముందు భాగం పైకి లేచిన దృశ్యం

భామిని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లింకు రోడ్డు పనులను అర్థాంతరంగా విడిచిపెట్టడంతో లగేజ్ వాహనాలకు ఇక్కట్లు తప్పడం లేదు. మంగళవారం బొడ్డగూడ రోడ్డు నుంచి సన్నాయి కాలనీ మీదుగా యాతంగూడకు ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ రహదారిలో కూరుకుపోయింది. బయటకు తీసే క్రమంలో ముందు చక్రాలు మీదకు లేచాయి. అతి కష్టం మీద ట్రాక్టర్ బయటకు తీశారు. ఈ దారిలో గృహ నిర్మాణానికి సామగ్రి తరలించడం కష్టంగా మారింది. పక్కా రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి

- **వెలుగు కార్యాలయాల్లో వీవోఏలు, ఎన్యుమరేటర్లకు ప్రత్యేక శిక్షణ**

పాచిపెంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ బి.శివుడునాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద వీవోఏలు, ఎన్యుమరేటర్లకు రుణాలు మంజూరు నిమిత్తం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 1,154 మహిళా సంఘాలకు రుణాల మంజూరు కోసం ప్రత్యేక యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నామని చెప్పా రు. సర్వే నిర్వహించేందుకు 130 మంది ఎన్యు మరేటర్లను నియమించామన్నారు. ఒక్కో సంఘ సభ్యురాలికి రూ.5లు చొప్పున ప్రభుత్వం పైకం చెల్లిస్తుందని తెలిపారు. మండలంలో 36 మంది వీవోఏలు ఉన్నారని తెలిపారు. వారం రోజుల్లో గా సర్వే నివేదిక అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు, ఎన్యుమరేట ర్లు, సీసీలు పాల్గొన్నారు. ● పార్వతీపురం రూరల్: మండలంలోని ప్రతి డ్వాక్రా మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం సన్నిబా బు కోరారు. మంగళవారం స్థానిక మండల సమైక్య కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీవనోపాధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరించారు. సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు. ● సాలూరు రూరల్: మహిళా సంఘాలు తీసుకున్న అప్పులు, వాటితో వారు పొందిన జీవనోపాదులను యాప్‌లో నమోదు చేయాలని వెలుగు జిల్లా ప్రత్యేకాధికారి హరిప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ నమోదుపై వెలుగు వీవోఏలు, ఎన్యూమరేటర్లకు మంగళవారం సాలూరు వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెలుగు ఏపీడీ సత్యంనాయుడు, ఏపీఎం అంపొల్లి జయమ్మ, స్త్రీ నిధి ఏజీఎం హేమలత పాల్గొన్నారు. ● సీతంపేట రూరల్: వార్షిక అప్పులు, జీవనోపాదుల ప్రణాళికపై వెలుగు వీవోఏ, ఎన్యూమరేటర్లకు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఏపీఎం సుశీల, ఎంఎం ఎస్ అధ్యక్షురాలు రోజారమణి, ఏపీఎం కమల కుమారి, సీసీలు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు. ● వీరఘట్టం: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలు, ఎన్యుమరేటర్లకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో కెల్ల రాము మాట్లాడుతూ ప్రజల జీవనోపాధిని గుర్తించడానికి, కావాల్సిన ప్రణాళిక తయారు చేయడానికి ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వీరఘ ట్టంలో 1750 ఎస్‌హెచ్‌జీలు ఉండగా పది సంఘాలకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున 175 మందిని గుర్తించి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఏపీఎం కె.రాము, మండల సమాఖ్య అధ్యక్షులు కె.లలితకుమారి, మండల ప్రత్యేక అధికారిణి చిన్న తల్లి, ఎఫ్‌పీవో సీసీ ఆనంద్, మురళీ సీసీ, మండల సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మున్సిపల్ కమిషనర్‌గా వరప్రసాద్

సాలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా బి.వరప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్ సీహెచ్ సత్యనారాయణ విధుల్లో అలసత్వం వహించినందుకు కలెక్టర్ ఆయన్ని సరెండర్ చేశారు. కాగా మున్సిపాల్టీలో డీఈగా పనిచేస్తున్న వరప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పి, కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది.

సీతంపేట ఎంపీడీవోకు బదిలీ

సీతంపేట రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కె.గీతాంజలికి బదిలీ అయ్యింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. గడచిన కొంత కాలంగా సీతంపేట ఎంపీడీవోగా పనిచేసిన గీతాంజలికి విజయవాడలోని ఏపీఎస్ఐఆర్డీ (పీఆర్)లో ఫ్యాకల్టీ మెంబర్‌గా బదిలీ అయ్యింది. ఆమె స్థానంలో పాలకొండ మండలంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న టి.కృష్ణారావుకు ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించారు.

చినభోగిలలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

పార్వతీపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, పాలకొండ, సాలూరుకు సంబంధించిన రవాణా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను సీతానగరం మండలం చినభోగిలలో ఉన్న ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ సెంటర్‌లో మాత్రమే నిర్వహిస్తారని జిల్లా రవాణా అధికారి టి.దుర్గాప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని వాహన యజమానులందరూ దీనిని గమనించాలన్నారు.

మద్యంతో ఒకరి అరెస్టు

కొమరాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుమడ గ్రామానికి చెందిన పట్నాన రాజారావు అక్రమంగా 12 మద్యం సీసాలను కలిగి ఉండటంతో అరెస్టు చేశామని కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. మంగళవారం నిర్వహించిన దాడుల్లో రాజారావు వద్ద అక్రమంగా ఉన్న మద్యం సీసాలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

సారా స్వాధీనం

కురుపాం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): అక్రమంగా సారా అమ్ముతున్న ఒక మహిళను అరెస్టు చేశామని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు కురుపాం నుంచి చినమేరంగి వెళ్లే దారిలో మంగళవారం దాడి చేయగా, కురుపాంకు చెందిన తోటపల్లి శాంతి 20 లీటర్ల సారా అమ్ముతూ పట్టుబడిందని చెప్పారు. సారాను స్వాధీనం చేసుకుని, మహిళపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

ఉపాధి పనులు కల్పించాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రావుపల్లిలో ఉపాధి పనులు కల్పించాలని టీడీపీ ప్రతినిధులు బోను సత్యనారాయణ, బొబ్బిలి శంకరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఏవో ఎస్.అర్జునరావుకు వినతి పత్రం అందించారు. ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్ మర్రాపు శంకరరావుపై పలు అభియోగాలు నెలకొన్నాయని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసుస్టేషన్‌కు సిమెంట్ బెంచీల వితరణ

బొబ్బిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రూరల్ పోలీసుస్టేషన్‌కు రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు తన సొంత నిధులతో 20 సిమెంట్ బెంచీలను అందజేశారు. సుమారు రూ.50వేలు విలువ గల సిమెంట్ బెంచీలను సీఐ నారాయణరావుకు ఆయన మంగళవారం అందజేశారు.